ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి



లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్షన్ స్వీప్ నోడల్ ఆఫీసర్ గోపాల్‌రావు శనివారం మాట్లాడుతూ.. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కాలనీలో ప్రతి ఒక్కరికి ఓటుపై అవగాహన కల్పించి 100 శాతం పోలింగ్ అయ్యేందుకు సహకరించాలని కోరారు. ఎస్ఆర్‌పీ భరత్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



బొటానికల్ గార్డెన్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గచ్చిబౌలి: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. శనివారం చేవెళ్ల పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, వెస్ట్ జోనల్ కమిషనర్ ఆదేశాలతో బొటానికల్ గార్డెన్, హుడాకాలనీ ఫేజ్-2 లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గమనించాలని సూచించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ పూజితగౌడ్

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో ఆమె నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతుగా నిలవాలని కోరారు. హస్తం గుర్తుకు ఓటువేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: మద్యం మత్తులో వాంతులు చేసుకుని ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భానుప్రసాద్ తెలిపిన ప్రకారం.. అస్సాం, ఉత్తర లిఖింపూర్ జిల్లా, పానిగావ్ గ్రామానికి చెందిన సీమంత దత్త రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస వచ్చాడు. సెక్యూరిటీ ప్రభాకర్ డొరువా రూమ్‌మేట్ అయిన శ్రీమంత దత్తకు శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ఫోన్ చేయగా.. కేశవనగర్‌లో ఉన్నానని చెప్పాడు. స్నేహితుడు వెళ్లి చూసేసరికి మద్యం మత్తులో వాంతులు చేసుకోవడంతో రూమ్‌కు వెళ్దామని చెప్పానని, అతడు రాలేదని అర్ధరాత్రి మృతి చెందాడని స్నేహితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ప్లాంట్ సీజ్

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రాంతంలో అక్రమంగా నీటి సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అక్రమంగా నీటి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు హెచ్చరించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: గత ప్రభుత్వం హయాంలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో శనివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ డివిజన్, మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల కాలంలో రూ.9000వేల కోట్లతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి ప్రతీకగా నిలిపామని వివరించారు. అభివృద్ధిలో పక్షపాతం లేకుండా పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించి మెరుగైన పాలన అందించామని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం ఆరు గ్యారంటీల ప్రవేశపెట్టి అమలు చేయడంలేదన్నారు. 10 ఏళ్లలో బీజేపీ చేసిందేమీలేదని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయాన్ని ఆపలేరన్నారు. ఈ నెల 22న పటాన్‌చెరులో నిర్వహించనున్న పటాన్‌చెరు డివిజన్, మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, మాజీ ఎంపీపీలు యాదగిరియాదవ్, శ్రీశైలంయాదవ్, పార్టీ మండల అధ్యక్షులు పాండు, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారం !

వాహనాల పార్కింగ్‌తో గంటల తరబడి ట్రాఫిక్ ● మామూళ్లు వసూలు చేస్తున్నారని అధికారులపై విమర్శలు

నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవడంతో ప్రధాన రహదారులపై పాదచారులకు ప్రమాదాలు జరగకుండా రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. వీటిని కూడా కొంతమంది ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించిన రహదారుల ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగించడంతో కొనేందుకు వచ్చిన వినియోగదారుల వాహనాలు పార్క్ చేయడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.



మియాపూర్‌లో ఫుట్‌పాత్‌పైనే వ్యాపారాలు కొనసాగిస్తున్న దృశ్యం



ఫుట్‌పాత్ పక్కన ఏర్పాటు చేసిన పెన్సింగ్ (ఫైల్)

మియాపూర్: బొల్లారం క్రాస్ రోడ్డు నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు జాతీయ రహదారిపై కోట్లాది రూపాయలు వెచ్చించి పాదాచారుల కోసం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఫుట్‌పాత్‌లు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర జోరుగా ఫర్నిచర్ దుకాణాలు కొనసాగిస్తున్నారు.

◆ మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు మెట్రోస్టేషన్ మధ్యలో జాతీయ రహదారి ప్రక్కన సర్వే నెంబర్ 28 ప్రభుత్వ భూమి ఖాళీగా ఉంది. ప్రతి మంగళవారం దశాబ్దాల నుంచి సంత జరుగుతుంది. కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో చుట్టు పక్కల కాలనీలు, బస్తీల నుంచి ఇక్కడకు వచ్చి నిత్యావసరాలు, కూరగాయలు కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు.

సంతకు సైతం దారి లేకుండా..

ప్రస్తుతం సంత ఏర్పాటు చేసిన ప్రదేశానికి దారి లేకుండా రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఫర్నిచర్ దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫర్నిచర్ కొనేందుకు వచ్చేవారి వాహనాలు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారిపై నిలపడంతో రహదారి కుంచించుకుపోతోంది.

ఇష్టానుసారంగా పార్కింగ్..

వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలు అడ్డుగా ఉండటంతో వేలాది వాహనాలు నిలిచిపోతున్నాయి. దీనిపై వాహనదారులు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ యంత్రాంగంపై మండిపడుతున్నారు.

తొలగించి మళ్లీ ఏర్పాటు...

గత ఏడాదిన్నర క్రితం ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని ఇక్కడ ఫర్నిచర్ దుకాణాలను రెవెన్యూ, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ఆ ప్రదేశంలో వ్యాపారాలు కొనసాగించకుండా రహదారి వెంబడి ఫుట్‌పాత్ ప్రక్కన లక్షల రూపాయలు వెచ్చించి పెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ పెన్సింగ్‌ను వ్యాపారస్తులు తొలగించి పజేసి గతంలో కంటే ఎక్కువగా రోడ్డు పొడవునా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఫర్నిచర్ దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

◆ గతంలో మెట్రోస్టేషన్ సమీపంలో కొంత వరకు పదుల సంఖ్యలో ఫర్నిచర్ దుకాణాలు ఉండేవి. ప్రస్తుతం సమీపంలో ఉన్న సర్వేనంబర్ 28లో గల ఖాళీ స్థలాన్ని అక్రమించి మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం..

శుక్రవారం మధ్యాహ్నం సమయంలో మియాపూర్‌లో రోడ్డు ప్రక్కన ఉన్న ఫర్నిచర్ దుకాణాల సమీపంలోని చెత్తకు నిప్పంటుకుని పక్కనే ఉన్న రెండు ఫర్నిచర్ దుకాణాల్లో సామగ్రి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పెన్సింగ్ తొలగించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

మామూళ్ల వసూలు..

కొందరు దళారులు అధికారులతో కలిసి ఫర్నిచర్ వ్యాపారుల వద్ద నెలనెల మామూళ్లు తీసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం, ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డుపై పార్కింగ్‌ను అడ్డుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు, లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పెన్సింగ్ నెట్ తొలగించిన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్ఐసీసీలో టైల్స్ మెగా ప్రదర్శన



హెచ్ఐసీసీలో సెరామిక్ టైల్స్ డిజైన్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

మాదాపూర్: వినియోగదారులకు మరిన్ని ఆధునిక ఉత్పత్తులు అందించడంలో సెరామిక్ టైల్స్ తయారీ కంపెనీ హెచ్ అండ్ ఆర్ జాన్సన్ 3000ల కొత్త టైల్ డిజైన్‌లను ప్రదర్శించింది. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం ప్రీజం జాన్సన్ విభాగమైన హెచ్ అండ్ ఆర్ జాన్సన్ అధ్వర్యంలో మెగా ప్రదర్శన నిర్వహించారు. ప్రీజం జాన్సన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ అగర్వాల్ టైల్ డిజైన్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ భారతదేశంలో అగ్రశ్రేణి టైల్స్ కంపెనీల్లో ఒకటిగా పేరు గాంచిందన్నారు. తాజాగా అందుబాటులోకి తెచ్చిన వాటిలో ప్లస్ వీఈ టైల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణానికి పెద్దపీట వేస్తుందన్నారు.

న్యాయసేవ సలహా కేంద్రం ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారంలో ఉచిత న్యాయ సేవ సలహా కేంద్రాన్ని ప్రముఖ న్యాయవాది గౌతమి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి చట్టపరమైన సందేహాలు ఉన్నా న్యాయ సేవ సలహా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ప్రతినిధి శారద పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యార్చన



మాదాపూర్ అన్నమయ్యపురంలో ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చనలో భాగంగా శనివారం నృత్య మయూరి కళానికేతన్ శిష్య బృందంచే నృత్యార్చన కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు నైవేద్య, తేజస్వి, ఆరాధ్య, మనస్వి, రిషి, ప్రియ, సాహితి, సృష్టి, శ్రీనిధి కయాతి, శ్రీనిధి, మేఘన, లేక్షన, విష్ణుప్రియలు గణపతి కీర్తన, వరవీణ గీతం, రుక్మిణీ ప్రవేశ దరువు తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందికుమార్ కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.



శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

శిల్పారామంలో..

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సత్యం డ్యాన్స్ అకాడమీ గురువు మేళ్లచెరువు కామేశ్వరీ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నమ రామాయణం, పూర్వరంగం, రామాయణ శబ్దం, శ్రీరామచంద్ర భావయామి, నగుమోము, దేహి, జగదానందకారక తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు. కళాకారులు అక్షిత, కీర్తన, విభా, ఇషితా, కళ్యాణి, శ్రావణి, సౌమ్య, శ్రీయ, సాయి సహస్ర, అనన్య జస్మితా తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తుకు బీజేపీని గెలిపించాలి



మాట్లాడుతున్న కొండా సంగీతారెడ్డి

మాదాపూర్: బలమైన దేశంగా భారతదేశం విరసిల్లాలంటే ప్రజలంతా బీజేపీని గెలిపించాలని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మైహోమ్ నవద్వీప కమిటీలో నిర్వహించిన సమావేశంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కొండా విశ్వేశ్వరరెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తారని తెలిపారు. చేవెళ్లలో గెలిపించడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో స్థానిక సమస్యలను పరిష్కరిస్తారన్నారు. మే 13ను హాలిడే కాకుండా పోలింగ్ డే గా భావించాలని సంగీతారెడ్డి కోరారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చారని ఆ గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు.

కాంగ్రెస్‌కు ఓటువేసి గెలిపించండి



మాట్లాడుతున్న డాక్టర్ రంజిత్‌రెడ్డి

మాదాపూర్: ప్రభుత్వం తరపున కాలనీల్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి తెలిపారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని అమర్ సొసైటీలో కాలనీల అసోసియేషన్ సభ్యులతో అల్పాహారం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి మాటే లేదని, సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేరాలను అరికట్టండి

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో రాత్రి సమయంలో దొంగతనాలు, దారి దోడిపీలు, హిజ్రాల వేధింపులు ఎక్కువవుతున్నాయని, వాటిని నివారించేందుకు పోలీస్ గస్తీని పెంచాలని సంక్షేమ సంఘం నాయకులు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని కోరారు. శనివారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. వాసు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో టౌన్‌షిప్‌లో అనేక వ్యాపార సంస్థలు పెడుతున్నారని, అవి అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయన్నారు. వాటికి వచ్చే స్థానికేతరులు టౌన్‌షిప్ వాసులుకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అలాంటి షాపులను సకాలంలో మూసుకునేలా ఆదేశాలు జారీ చేయటంతో పాటు దొంగతనాలను నివారించేందుకు అవసరమైన గస్తీ పెంచాలని సీఐని కోరామన్నారు.

హోర్డింగ్‌లపై ఆరా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్ల పక్కన ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లపై ఈ నెల 17న సాక్షి దినపత్రికలో 'బాబోయ్.. హోర్డింగులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయంపై ఆర్‌డీఎంఏ శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. ఎన్ని హోర్డింగ్‌లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన హోర్డింగ్‌లను ఎప్పటివరకు తొలగిస్తారు.. అనే విషయాలపై ఆరా తీశారు. ఆర్‌డీఎంఏ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చిన హోర్డింగ్‌లను త్వరలోనే తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి వివరణ ఇచ్చారు.

సాక్షి ఎఫెక్ట్..

స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ లక్ష్మణ్‌రావు

గచ్చిబౌలి: ఉన్నత లక్ష్యాల కోసం కష్టపడి చదివించాలని సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. సంస్కృతి స్కూల్ డైరెక్టర్లు భవాని, భార్గవి, ప్రిన్సిపాల్ దీప్తి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గచ్చిబౌలి: మద్యం సేవించొద్దని వారించినందుకు భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భానుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో నివసించే మోరి రాజు(32) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు మద్యం మత్తులో ఇంటికి రాగా.. భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గదిలోకి వెళ్లిన అతడు అర్ధరాత్రి ఇంటి పైకప్పు రాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా మృతుడికి ముగ్గురు కుమార్తెలు సంతానం. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

తలనొప్పితో బాధపడుతున్న విదేశీ మహిళలకు చికిత్స

సాక్షి, సిటీబ్యూరో: దీర్ఘకాలిక తలనొప్పితో బాధపడుతున్న ఓ విదేశీ మహిళలకు ఏఐజీ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స చేశారు. ఈ మేరకు ఆమె పూర్తిగా కోలుకున్నట్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్‌కు చెందిన మహిళ(24) గత కొంతకాలంగా తలనొప్పితో బాధపడుతోంది. స్థానికంగా ఉన్న వైద్యులకు చూపించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఏఐజీలోని న్యూరోసర్జరీ, పెయిన్ మేనేజ్‌మెంట్ వైద్యుడు డాక్టర్ సిద్దార్థ్ చావలి, సుబోద్‌రాజ్‌ల బృందాన్ని ఆశ్రయించగా, వారు ఆమెకు పలు వైద్య పరీక్షలు చేసి మైగ్రేన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆసియాలోనే తొలిసారిగా న్యూరోస్టిమ్యూలేటర్ ఇంప్లాంట్ సర్జరీ (నొప్పి కారక నరాలకు తేలిక పాటి విద్యుత్ ప్రేరణలను అందించడం) ద్వారా నొప్పి నుంచి ఉపశమనం కల్పించినట్లు వారు ప్రకటించారు. దీర్ఘకాలిక తలనొప్పితో పాటు వెన్ను నొప్పితో బాధపడుతున్న వారికి ఈ తరహా చికిత్స ఓ గొప్ప వరమని ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే శేరిలింగంపల్లి బాధ్యత తీసుకుంటాం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



రాఘవేంద్రకాలనీ ఇంటింటి ప్రచారంలో పటేల్ రమేష్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే శేరిలింగంపల్లి బాధ్యత మేము తీసుకుంటామని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డిని నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతుందన్నారు. చేవెళ్ళ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి భారీ మెజార్టీని శేరిలింగంపల్లిలో కలిగేలా చేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా అన్ని చోట్ల ప్రచారం చేసేందుకు కలిసికట్టుగా ముందుకురావడం శుభపరిణామమన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఆర్ట్ గ్యాలరీ' చిత్ర ప్రదర్శనలు









మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో రెండు వేర్వేరు ప్రదర్శనలను శనివారం ప్రారంభించారు. చిత్రకళాకారుడు వి.లక్ష్మణ్ వేసిన చిత్రాలను 'నేచర్ విత్ హ్యూమన్ ఫేస్' పేరిట చిత్రప్రదర్శనను సినీ నిర్మాత సాయివెంకట్ ప్రారంభించారు. కళాకారుడు వేసిన చిత్రాలను సందర్శకులు కొనియాడారు. ప్రదర్శనలో 27 చిత్రాలను అందుబాటులో ఉంచారు. నేటితో ప్రదర్శన ముగియనుందని నిర్వాహకులు ప్రకటించారు. దివ్యాంగ చిత్రకళాకారులు 41 మంది వేసిన 70 చిత్రాలను యాన్ ఇన్‌క్లూసివ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పేరిట ప్రారంభించారు. ఈ ప్రదర్శన 23 వరకు కొనసాగనుందని వివరించారు.